## క్లుప్తంగా

### ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లో డీఆర్ఎం తనిఖీలు



ఎలక్ట్రికల్ లోకోషెడ్‌లో పర్యటిస్తున్న డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్ ప్రసాద్ మంగళవారం ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, లోకోలో పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఉద్యోగులు భద్రత ప్రమాణాలు పాటిస్తూ క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేయాలని డీఆర్ఎం సూచించారు.

### రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత



సత్యం జంక్షన్ వద్ద ప్లకార్డులతో అధికారులు

సీతమ్మధార : రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని రవాణా శాఖ అధికారులు బుచ్చిరాజు, గణేష్‌రెడ్డి అన్నారు. జాతీయ రహదారి భద్రత మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సత్యం జంక్షన్ వద్ద రవాణా శాఖ, పోలీస్ సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రహదారి భద్రతకు సంబంధించి ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనచోదకులకు, సీటు బెల్ట్ పెట్టుకుని కార్లు డ్రైవింగ్ చేస్తున్న వారిని అభినందిస్తూ పువ్వులు, చాక్లెట్లను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు రోఖీమున్నిశా, మాధవి, మన్మోహన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### శాస్త్రోక్తంగా వారాహి హోమం



శ్రీలలితాపీఠంలో వారాహి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సీతంపేట: బహుళ పంచమి సందర్భంగా అక్కయ్యపాలెం శ్రీలలితా పీఠంలో మంగళవారం సాయంత్రం వారాహి హోమం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా జరిపించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### గాయని సాహితికి వేటూరి పురస్కారం



సాహితికి పురస్కారం అందజేస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్ : వర్ధమాన సినీ నేపథ్య గాయని సాహితికి వేటూరి యువ గాయని పురస్కారం ప్రదానం చేయడం అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. సినీ గేయ రచయిత వేటూరి 98వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆత్రేయ స్మారక కళా పీఠం ∞ఎదలో మోహన లాహిరి∞శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ వేటూరి పేరిట పురస్కారానికి సాహితీ ఎంపిక కావడం హర్షనీయమన్నారు. అనంతరం శంబర జోగారావు సారథ్యంలో నిర్వహించిన సంగీత విభావరిలో సాహితీ, రమేష్ పట్నాయక్ ఆలపించిన వేటూరి గీతాలు అలరించాయి. గంటి మురళి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విజయనగరం కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అవనాపు విజయ్, పైడా కృష్ణప్రసాద్, ఉసిరికాయల చంద్రశేఖర్, సుహాసిని ఆనంద్, దాడి సత్యనారాయణ, కళా సంస్థల అధినేతలు చెన్నా తిరుమలరావు, ఎన్ఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



# పేదల వైద్యానికి భరోసా

- భవానీ గార్డెన్స్‌లో ఆరోగ్య కేంద్రం ఏర్పాటుపై హర్షం
- జీవీఎంసీ 54, 57 వార్డుల ప్రజలకు అందుబాటులో నిపుణుల వైద్య సేవలు



యూపీహెచ్‌సీలో అందిస్తున్న సేవలపై రోగులతో మాట్లాడుతున్న కేకే రాజు



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



ఇటీవల ప్రారంభించిన భవానీ గార్డెన్స్ ఆర్యోగ కేంద్రం

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యానికి పెద్దపీట చేసిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. పేదలు ఎవరూ అనారోగ్య సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టం చేశారు. జీవీఎంసీ 54, 57 వార్డుల ఉత్తర – పశ్చిమ నియోజకవర్గాల ప్రజలకు అందుబాటులో భవానీ గార్డెన్స్‌లో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ఇటీవల ప్రారంభించారు. గతంలో ఈ వార్డు ప్రజలు 2 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆర్పీపేట యూపీహెచ్‌సీకి వెళ్లేవారు. పేదలు, సామాన్యుల వైద్యానికి భరోసా ఇస్తూ అందుబాటులోకి వైద్య, ఆరోగ్య సేవలు తీసుకురావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ హయాంలో ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకునే పాపాన పోలేదు. దీంతో సుదూర ప్రాంతాలకు రోగులు తరలివెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వచ్చింది. పేదలు కనీసం మందులకు నోచుకునే వారు కాదు. ఇటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులతో ప్రజల చెంతకు వైద్య సేవలు చేరాయి.

**భవానీగార్డెన్స్ యూపీహెచ్‌సీ స్వరూపమిదీ...**

| | |
|---|---|
| సచివాలయాలు | 08 |
| మెడికల్ అధికారి | 01 |
| స్టాఫ్ నర్స్ | 02 |
| ఫార్మాసిస్ట్ | 01 |
| ల్యాబ్ టెక్నీషియన్ | 01 |
| డేటా ఎంట్రీ ఆపరేటర్ | 01 |
| ఎల్‌జీఎస్ ఆపరేటర్ | 01 |
| ఏఎన్ఎంలు | 08 |
| ఆశావర్కర్లు | 08 |
| టీబీహెచ్‌వీ | 01 |

**54, 57 వార్డుల ప్రజలకు చేరువలో....**

జీవీఎంసీ 54, 57 వార్డులు కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం ప్రజలకు ఐటీఐ జంక్షన్ ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో సుమారు రూ.1.25 కోట్ల వ్యయంతో భవానీ గార్డెన్స్‌లో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)లో ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ 10 పడకలు ఏర్పాటు చేశారు. ఈ రెండు వార్డుల్లోని రెడ్డి కంచరపాలెం, దేవేంద్రనగర్, శ్రీనగర్, రవీంద్రనగర్, సుభాష్‌నగర్, గౌరీనగర్, తుమ్మడపాలెం, శ్యామ్‌నగర్, బాపూజీనగర్, మహారాణివీధి, జ్యోతినగర్, సిద్దార్థనగర్, గజపతినగర్ ప్రాంతాల నుంచి రోజూ వందల సంఖ్యలో రోగులు ఇక్కడకు వచ్చి వైద్య సేవలు, మందులు ఉచితంగా పొందుతున్నారు. భవానీగార్డెన్స్ ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ ఓపీ సేవలతోపాటు స్పెషలిస్ట్ వైద్యుల సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సాధారణ వైద్య సేవలు పొందవచ్చు. రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పెషలిస్ట్ ఓపీ సేవలు అందిస్తారు. రోజు ఓపీ సుమారు 135 నుంచి 180 వరకు ఉంటుంది. రోజూ అల్ట్రా సౌండ్ స్కానింగ్ సిస్టమ్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు.



ఉచితంగా మందులు అందజేస్తున్న ఫార్మాసిస్ట్

**స్పెషలిస్ట్ వైద్య సేవలు**

| | |
|---|---|
| సోమవారం | : ఎముకలు, కండరాలు |
| మంగళవారం | : శ్వాస వ్యవస్థ |
| బుధవారం | : సాధారణ శస్త్రచికిత్స |
| గురువారం | : జనరల్ వైద్యం |
| శుక్రవారం | : చెవి, ముక్కు, గొంతు |
| శనివారం | : చర్మ వ్యాధులు, మహిళల సమస్యలు |

### అందుబాటులో వైద్య సేవలు



గతంలో మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్ వంటి పెద్దాస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. యూపీహెచ్‌సీ ఏర్పాటుతో మెడికల్ సదుపాయాలు అందుబాటులోకి రావడం ఎంతో ఆనందంగా ఉంది. సాధారణ సేవలతోపాటు స్పెషలిస్ట్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైతే ఉచితంగా మందులు అందిస్తున్నారు.

– ఎస్.రామ్‌ప్రసాద్, తుమ్మడపాలెం

### పైసా ఖర్చు లేకుండా వైద్యం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు. వీటితోపాటు జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటుకి తెచ్చారు. సీఎం ఆలోచన పేదలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. ఒక్క పైసా ఖర్చు లేకుండా నిపుణలతో వైద్య సేవలు, ఉచితంగా మందులు అందిస్తున్నారు.

– నరసయ్యమ్మ, సిద్దార్థనగర్, ఊర్వశికూడలి

### కార్పొరేట్ తరహా వైద్యం



ప్రజలకు కార్పొరేట్ తరహాలో ఉచిత వైద్య సేవలు రోజూ అందిస్తున్నాం. జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ఇప్పటికే వైద్య శిబిరాలు నిర్వహించాం. వేల సంఖ్యలో ప్రజలు వైద్య సేవలు వినియోగించుకున్నారు. పలు రకాల వైద్యానికి కార్పొరేట్ వైద్యశాలలకు రిఫర్ చేశాం. వైద్య శిబిరాల సమయంలో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశాం. ఇక్కడ యూపీహెచ్‌సీ ఏర్పాటుతో స్థానిక రోగులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన భారం తగ్గింది. మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

– శాంతి, ప్రధాన వైద్యాధికారి భవానీ గార్డెన్స్ యూపీహెచ్‌సీ

### కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఫిబ్రవరి ఒకటిన సహస్ర తులసిపూజ**

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఫిబ్రవరి 1న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

### క్రీడల లోగో ఆవిష్కరణ



మాట్లాడుతున్న డాక్టర్ అశోక్‌కుమార్, తదితరులు

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న మెగా స్పోర్ట్స్ కార్నివాల్‌కు సంబంధించిన లోగోను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలను స్ఫూర్తిగా తీసుకుని ఆంధ్రా మెడికల్ కాలేజీ, అనుబంధ ఆస్పత్రుల ఉద్యోగులు, సిబ్బందితో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్, అథ్లెటిక్, చెస్, క్యారమ్స్ వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ఆర్ ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి, నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పనా మౌళి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయాలు ఆచరణీయం



గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్, తదితరులు



డీఆర్ఎం కార్యాలయంలో మహాత్మునికి నివాళులర్పిస్తున్న డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్, అధికారులు



వాకర్స్ పార్కులో మహాత్ముడి విగ్రహం వద్ద ప్రసంగిస్తున్న చంద్రమౌళి

సీతమ్మధార : మహాత్మ గాంధీజీ ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ అన్నారు. గాంధీ వర్ధంతి కార్యక్రమం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ముందుగా మహాత్ముడి చిత్ర పటానికి తహసీల్దార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్ముని ఆశయాలు నేటి యువతకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వోలు పొన్నాడ నాగేశ్వరరావు, వీఎల్ఎస్ మూర్తి, శ్రీధర్, శ్రీను, వర్మ, గ్రేట్ టూ వీఆర్వో షేక్ ఖాదర్‌బాబా పాల్గొన్నారు.

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా మహాత్ముడి విగ్రహానికి వాకర్స్ జిల్లా 101 గవర్నర్ టి.రంగారావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, క్లబ్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ పూర్వాధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, రాళ్ళపల్లి సత్యనాథం, సీహెచ్.కృష్ణమూర్తి, వాకర్స్ జిల్లా ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

**ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం**

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో మహాత్మా గాంధీ వర్ధంతి, అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. వైశాఖీ స్పోర్ట్స్ పార్క్, వనితా వాకర్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరి ప్రభావతి.. మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పి.చంద్రమౌళి, వైభవ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్.దుర్గా ప్రసన్న, వనితా వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి షీలారాణి, పూర్వ గవర్నర్ యు.శుభ, జాలీ వాకర్ ఎం.ప్రమీల రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

**వాల్తేర్ డివిజన్‌లో షాహిద్ దివస్**

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో మంగళవారం షాహిద్ దివస్ ఘనంగా నిర్వహించారు. మహాత్మగాంధీ వర్ధంతి, స్వాతంత్ర్య సమరంలో అమరులైన వీరుల కోసం దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయంలో డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్ ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా ప్రతి సంవత్సరం జనవరి 30న షాహిద్ దివస్(అమరవీరుల దినోత్సవం) నిర్వహిస్తున్నట్టు డీఆర్ఎం గుర్తు చేశారు.

సీతమ్మధార : మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఏపీఈపీడీసీఎల్ ఆవరణలో గల మహాత్మా గాంధీ విగ్రహానికి ఏపీఈఆర్సీ చైర్మన్ నాగార్జునరెడ్డి, సీఎండీ పృద్వీరాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఈఆర్సీ సభ్యులు ఠాకూర్ రామసింగ్, పీవీఆర్ రెడ్డి, సీఎండీ కె.సంతోష్‌రావు, సంస్థ డైరెక్టర్లు బి.రమేష్‌ప్రసాద్, డి.చంద్రం, ఏవీవీ సూర్యప్రతాప్ పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏపీఈఆర్సీ చైర్మన్ నాగార్జునరెడ్డి



వైశాఖి స్పోర్ట్స్ పార్కులో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సనపల వరప్రసాద్, పి.ప్రభావతి

### బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం



చొక్కాకుల వెంకటరావును సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురంలో సిటీ బాక్సింగ్ క్లబ్ నేతృత్వంలో మంగళవారం ఆంధ్ర బాక్సింగ్ చాంపియన్ షిప్ – 2024 పోటీలు నిర్వహించారు. పోటీలను విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ వీడీపీ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, విశాఖ పోర్టు అథారిటీ యూనియన్ నాయకులు గొర్లెల చందు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం పొందుతారని తెలిపారు. ముందుగా చొక్కాకుల వెంకటరావును క్లబ్ సభ్యులు గజమాలతో ఘనంగా సత్కరించారు. 3 రోజులపాటు బాక్సింగ్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బ్రదర్ పి.రాజేష్, బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యల్లపు రఘురామ్, అమ్మోరు, రిఫరీ వాడాడ రూబెన్, టీవీఎస్ఎన్ అనిల్‌కుమార్, డి.కనకరాజు, బి.శ్రీనివాసు, వీరబాబు, రాంబాబు, డాక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.



### సినిమా సాహిత్యంతో విలువలపై అవగాహన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'దాశరథి సినీ సాహిత్యం–జనరంజక వీణానాదం'అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ సినిమా సాహిత్యం ఒకవైపు ఆనందాన్ని అందిస్తూనే సమాజ విలువలను తెలియజేస్తుందన్నారు. ప్రత్యేక అతిథి మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి ఆచార్య వి.శంకరరావు మాట్లాడుతూ సాహిత్యంలో అద్భుతమైన పాటలు రాసి సాహిత్యపు విలువలు పెంపొందించిన సినీ గేయ రచయత దాశరథి అని కొనియాడారు. ఎటువంటి అశ్లీలత దొర్లకుండా విలువలతో కూడిన సాహిత్యం అందించారన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న రచించిన 90వ పుస్తకం రావిశాస్త్రి రచనలు–అభ్యుదయ దృక్పథం పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావుకు అంకితం చేసినట్లు ఆచార్య సిమ్మన్న తెలిపారు. సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, డాక్టర్ ఎ.ఈశ్వరమ్మ, డాక్టర్ బి.వెంకటస్వామి, డాక్టర్ కె.రత్నశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న కమిటీ నాయకురాలు దయామణి

మహారాణిపేట : వైద్య ఆరోగ్య శాఖలోని పలు విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలని ఏపీ నర్సు స్ట్రగుల్ కమిటీకి చెందిన నాయకురాళ్లు దయామణి, వేదవతి కోరారు. మంగళవారం జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశ మందిరంలో కమిటీ సర్వ సభ్య సమావేశం జరిగింది. నాయకురాలు దయామణి మాట్లాడుతూ వైద్య విద్య, విధాన పరిషత్, పబ్లిక్ హెల్త్, నేషనల్ హెల్త్ మిషన్‌లో దాదాపు 11,500 మంది నర్సులు కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారని అన్నారు. తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. క్రమబద్ధీకరించే వరకు వంద శాతం గ్రాస్ శాలరీతో పాటు ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఆర్.రాంబాబు, వై.వరలక్ష్మి, బి.స్వాతి కుమారి, సీహెచ్ సతీష్, జి.కోటేశ్వరరావు, సూర్యకళ, మూర్తి, చిన్నారి, పి.జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### విశాఖ ఉక్కులో పరిస్థితులు ఆందోళనకరం

గాజువాక: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో పరిస్థితులు నానాటికీ ఆందోళనకరంగా మారుతున్నాయని స్టీల్‌ప్లాంట్ నాన్ జేసీఎం కార్మిక సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గాజువాకలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాన్ జేసీఎం సభ్యుడు డి.వి.రమణారెడ్డి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మూడేళ్లుగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోగా, ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేటీకరిస్తున్నారన్నారు. వివిధ కారణాలను చూపించి కార్మికులను తొలగించడం సరి కాదన్నారు. మరోపక్క కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు దెబ్బ తింటున్నాయన్నారు. ఈ సమస్యలపై ప్రధాన కార్మిక సంఘాలు స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ప్రధాన సంఘాలు స్పందించకపోయినా తమ శక్తిమేరకు పోరాడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గణపతిరెడ్డి, కొమ్మినేని శ్రీనివాసరావు, నక్కా వెంకట రమణ, గుమ్మడి నరేంద్ర, మహాలక్ష్మి నాయుడు, లక్ష్మణ్, డేవిడ్, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు రీజినల్ జాబ్ మేళా

మురళీనగర్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విజయనగరం సీతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో రీజినల్ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ జాబ్ మేళాలో 87 బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్, బ్యాంకింగ్, ఫైనాన్స్, టూరిజం –హాస్పిటాలిటీ, రిటైల్, మార్కెటింగ్, లాజిస్టిక్స్, రిటైల్ జ్యువలరీ విభాగాల్లో సుమారు 5,892 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. విశాఖపట్నం జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగ యువతీయువకులు హాజరు కావాలని, స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల నైపుణ్యాల ఆధారంగా రూ.15,000 నుంచి రూ.60,000 వేల వరకు వేతనాలు ఉంటాయన్నారు.